క్లుప్తంగా

4న కంటి వైద్యశిబిరం

హుజూర్‌నగర్ : పట్టణంలోని ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగుల సంఘం భవనంలో ఈనెల 4న ఉచిత కంటి వైద్యశిబిరం ఏర్పాటు చేయనున్నట్లు ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్.సోమయ్య, కె.వీరారెడ్డిలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డు ఉద్యోగులు, వారిపై ఆధారపడిన వారికి, ఈహెచ్‌ఎస్ హెల్త్ కార్డు ఉన్న వారికి కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

ఆర్థికసాయం అందజేత



వినయ్‌కు ఆర్థికసాయం అందజేస్తున్న డాక్టర్ మల్లెబోయిన అంజియాదవ్

అనంతగిరి : ప్రజలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే ప్రభుత్వం ఉచిత విద్య, వైద్యం అందించాలని డాక్టర్ మల్లెబోయిన అంజియాదవ్ అన్నారు. మండలంలోని వసంతపురం గ్రామానికి చెందిన సాలె వినయ్ గత కొద్దిరోజుల క్రితం ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న అంజియాదవ్ ఆదివారం అతనిని పరామర్శించి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్, నాయకులు శేఖర్, గోపి, వెంకన్న, శ్రీనివాసరావు, రాములు, సాయి, యేసు, శ్రీను, బాబు, రాకేష్, రాంచంద్, తదితరులు పాల్గొన్నారు.

పాత పద్ధతిలోనే పోలీస్ నియామకాలు చేపట్టాలి

చిలుకూరు : పాత పద్ధతిలోనే పోలీసు నియామకాలు చేపట్టాలని ఏఐవైఎఫ్ మండల అధ్యక్షుడు అనంతుల రాము డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పోలీసు నియామకాలలో కొత్తగా తీసుకొచ్చిన జీఓ 46ను రద్దు చేయాలన్నారు. నిరుద్యోగ యువత కష్టపడి అర్హత సాధించిన తరువాత ఫలితాలు విడుదల చేసేముందు జిల్లాల వారిగా పర్సంటేజీ ప్రకారం ఎంపిక ఉంటుందనడం ఎంతవరకు సమంజసమన్నారు. మెరిట్ ప్రకారం ఉద్యోగ ఫలితలు కల్పించాలని డిమాండ్ చేశారు.

కోలాటం మహిళలకు చీరల పంపిణీ



మహిళలకు చీరలు అందజేస్తున్న సర్పంచ్ సరోజనిపిచ్చిరెడ్డి

గరిడేపల్లి : మండలంలోని పొనుగోడు గ్రామంలో కోలాటం మహిళలకు జోగు పిచ్చిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సర్పంచ్ జోగు సరోజనిపిచ్చిరెడ్డి రూ.30 వేల విలువ గల చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కనుమరుగు అవుతున్న జానపద కళలకు జీవం పోయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ కోశాధికారి జోగు అరవింద్‌రెడ్డి, కోలాటం మాస్టర్ కుర్రి వెంకన్న, రాంబాబు, సైదులు, రవి, జానీ, జాన్ షరీఫ్, రఫీ తదితరులు ఉన్నారు.

గ్రామీణ క్రీడలు ఐక్యతకు దోహదం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న అంజియాదవ్

నడిగూడెం : గ్రామీణ క్రీడలు ఐక్యతకు దోహదపడతాయని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్.మల్లెబోయిన అంజియాదవ్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని ఎకలాస్‌ఖాన్‌పేటతండాలో రామూనాయక్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండల స్థాయి క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. అనంతరం పలువురు క్రీడాకారులకు క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రామూనాయక్ యూత్ అధ్యక్షుడు రామ్‌లక్ష్మణ్, నిర్వాహకులు శ్రీను, వీరన్న, సురేష్, పవన్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కోదాడఅర్బన్ : ట్రాన్స్‌పోర్టు రంగంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి కె.వెంకటనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం కోదాడలోని సుందరయ్య భవన్‌లో జరిగిన ఆటో వర్కర్స్ యూనియన్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. డీజిల్, పెట్రోల్, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో ట్రాన్స్‌పోర్ట్ కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ట్రాన్స్‌పోర్టు కార్మికులకు నెలవారీగా భృతి ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు వట్టెపు సైదులు, పట్టణ ప్రధాన కార్యదర్శి ఎం.ముత్యాలు, నరేష్, రాజశేఖర్, వినోద్, ఇమామ్, బాష తదితరులు పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా 'ఎత్తిపోతల' నిర్వహణ

- నామమాత్రంగా నడిపిస్తున్న నీటి సంఘాల మాజీ చైర్మన్లు
- చివరి భూములకు నీరందక ఇబ్బందులు పడుతున్న రైతులు
- పట్టించుకోని అధికారులు



నడిగూడెం వద్ద ఎల్ -34 ఎత్తిపోతల పథకం



నడిగూడెం వద్ద ఎల్-34 ఎత్తిపోతల పథకంపై దెబ్బతిన్న షట్టర్లు

నడిగూడెం : మండల పరిధిలోని నాగార్జునసాగర్ ఎడమ కాల్వకు అనుబంధంగా ఉన్న పలు ఎత్తిపోతల పథకాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. 2009 వరకు నీటి సంఘాలు ఉండటంతో నిర్వహణ బాగానే ఉండేది. కానీ నీటి సంఘాలు రద్దయిన తర్వాత ఎత్తిపోతల పథకాల నిర్వహణ అధ్వానంగా తయారైంది. దీంతో పలు గ్రామాలలోని చివరి భూములకు నీరందక రైతులు ఇబ్బంది పడుతున్నారు. నడిగూడెం మండల కేంద్రంతో పాటు, నారాయణపురం, సిరిపురం, కాగితరామచంద్రాపురం వద్ద సాగర్ ఎడమ కాల్వకు అనుసంధానంగా 25 ఏళ్ల క్రితం ఎత్తిపోతల పథకాలను నిర్మించారు. నడిగూడెం వద్ద గల ఎల్- 34 ఎత్తిపోతల కింద నడిగూడెం, రామాపురం గ్రామాలలో 600 ఎకరాలు, ఎల్- 35 కింద నారాయణపురం, బృందావనపురం, వేణుగోపాలపురం, చెన్నకేశ్వాపురం, కరివిరాల, నడిగూడెం, సిరిపురం గ్రామాలలో 3800 ఎకరాలు, అలాగే ఎల్- 36 కింద కాగిత రామచంద్రాపురం, వెంకట్రాంపురం గ్రామాల కింద 600 ఎకరాలు, అదేవిధంగా సిరిపురం వద్ద ఆర్- 10 పథకం ద్వారా సిరిపురం, శ్రీరంగాపురం, త్రిపురవరం గ్రామాల కింద 1200 ఎకరాలకు, కృష్ణానగర్ సమీపాన ఆర్- 9 పథకం ద్వారా కృష్ణానగర్, రామాపురం, ఎకలాస్‌ఖాన్‌పేట, ఎకలాస్‌ఖాన్‌పేట తండా, తెల్లబెల్లి, కోదండరామాపురం, ముకుందాపురం, ఆకుపాముల, బరాఖత్‌గూడెం గ్రామాలకు 2400 ఎకరాలకు సాగు నీరించేందుకు లక్ష్యంగా నిర్మించారు. ఆరంభంలో సాగు నీరు పుష్కలంగా అందినా గత 14 సంవత్సరాలుగా నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది.

అధ్వానంగా కాల్వలు..

ఎత్తిపోతల పథకాల కింద ఉన్న మేజర్, మైనర్ కాల్వలు పలుచోట్ల కంపచెట్లమయంగా ఉన్నాయి. పలు చోట్ల పూడిపోయాయి. లైనింగ్‌లు కూడా దెబ్బతిన్నాయి. దీంతో నీటి సరఫరాకు అంతరాయం కలుగుతోంది. అలాగే పలు చోట్ల షట్టర్లు కూడా దెబ్బతినడంతో నీరు వృథా అవుతోంది. నాలుగేళ్ల కిందట కో ట్ల రూపాయల వ్యయంతో ఆధునీకరణ పనులు చేపట్టినా ఫలితం లేకుండా పోయిందని రైతులు అంటున్నారు. సాగుకు సరిపడా నీరందకపోవడంతో రైతులు బోర్లు ఏర్పాటు చేసుకోవడంతో పాటు బావులు కూడా తీయించుకున్నారు. దీంతో ఆయకట్టు తగ్గింది.

సొంత డబ్బుతో మరమ్మతులు..

మండల వ్యాప్తంగా గల నాలుగు ఎత్తిపోతల పథకాల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండడంతో గతంలో నీటి సంఘాల చైర్మన్‌లుగా పని చేసిన నాయకులు ప్రస్తుతం నామమాత్రంగా నడిపిస్తున్నారు. రైతులు శిస్తులు సరిగ్గా చెల్లించకపోవడంతో పలువురు మాజీ చైర్మన్‌లు సొంత డబ్బుతో మరమ్మతులు చేయించి పథకాలను నిర్వహిస్తున్నారు. ఎల్- 35 పథకం మాజీ చైర్మన్ మండవ అంతయ్య గతంలో దాదాపు ఐదు లక్షల రూపాయల వ్యయంతో మరమ్మతులు చేయించి, పథకాన్ని నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కాల్వలకు, మోటార్లకు మరమ్మతులు చేయించి, ఎత్తిపోతల పథకాలను నిర్వహించాలని గ్రామాల రైతులు కోరుతున్నారు.

కాల్వల లైనింగ్ దెబ్బతిన్నది



ఆర్- 10 ఎత్తి పోతల పథకం కింద చివరి భూములకు నీరదడంలేదు. పలుచోట్ల లైనింగ్ దెబ్బతినడంతో పాటు, కంపచెట్లమయంగా మారాయి. సంబంధిత అధికారులు స్పందించి మేజర్ కాల్వలతో పాటు మైనర్ కాల్వలకు మరమ్మతులు చేపట్టాలి.

– వట్టికూటి రమేష్, రైతు, వల్లాపురం

మరమ్మతులు చేయాలి



ఎల్- 36 ఎత్తిపోతల పథకం కింద దాదాపు 600 ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ పథకం క్రింద మూడు గ్రామాలున్నాయి. కాల్వలు అధ్వానంగా మారడంతో పాటు మోటార్లు మొరాయిస్తుండటంతో నిర్వహణ కష్టంగా మారింది. అధికారులు స్పందించి మరమ్మతులు చేయించి, చివరి భూములకు నీరందించాలి.

– బందారపు మల్లికార్జున్, రైతు, కాగితరామచంద్రాపురం

బాధిత కుటుంబాలకు భరోసా.. సీఎంఆర్‌ఎఫ్



అల్లీపురంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

మఠంపల్లి : అనారోగ్యంతో బాధపడుతున్న బాధిత కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి భరోసాగా నిలుస్తోందని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఇరుగు పిచ్చయ్య, సర్పంచ్ శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని రఘునాథపాలెం, వర్దాపురం, చెన్నాయిపాలెం, పెదవీడు, బీల్యానాయక్‌తండా, అల్లీపురం గ్రామాలకు చెందిన లబ్ధిదారులు అర్లప్ప, హమీద్, ఫరీద్‌బీ, అరుణ, హేమ్లా, శిరీష, బుజ్జి, తదితరులకు రూ.2 లక్షల 2వేల విలువగల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఇంటింటికి వెళ్లి అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు కొండేటి సుధాకర్‌రెడ్డి, పటాన్‌హఫీజ్‌ఖాన్, సైదయ్య, భరత్‌నాయక్, రాజీవ్, సురేష్‌గౌడ్, మహేష్‌గౌడ్, వీరబాబుగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, గోపి, కాంతారావు, శివారెడ్డి, బడేసా, చాలీసా, ఆరోని పాల్గొన్నారు.

పూసల కులస్తులు రాజ్యాధికారం సాధించాలి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

హుజూర్‌నగర్‌రూరల్ : పూసల కమ్యూనిటీ భవనం నిర్మాణానికి రూ.20 లక్షలు నిధులు మంజూరు చేయాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు పాదిల ఏడుకొండలు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం మండల పరిధిలోని గోపాలపురంలో ఏర్పాటు చేసిన ఆ సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పూసల కులస్తులు రాజకీయంగా రాజ్యాధికారం సాధించాలని పిలుపునిచ్చారు. విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు పాదిల వెంకటేశ్వర్లు, భిక్షం, తిప్పని శేఖర్, యాదగిరి, రాంబాబు, రాములు, గోపాలకృష్ణ, కాశయ్య, మట్టపల్లి తదితరులు పాల్గొన్నారు.

భారతీయ సంస్కృతిలో గురుపూజకు ప్రాధాన్యం



మాట్లాడుతున్న వంగర భరద్వాజ్

నేరేడుచర్ల : అజ్ఞానం నుంచి జ్ఞానం వైపు నడిపించే వారే గురువని, భారతీయ సంస్కృతిలో గురుపూజకి ప్రాధాన్యం ఉంటుందని ఆర్‌ఎస్‌ఎస్ నల్గొండ విభాగ్ ప్రచార ప్రముఖ్ వంగర భరద్వాజ్ అన్నారు. ఆషాఢ పౌర్ణమి, గురు పౌర్ణమి సందర్భంగా ఆదివారం నేరేడుచర్లలోని శ్రీదేవిభూదేవిసమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగవత్ ధ్వజం ఎగురవేశారు. భరతమాత, ఆర్‌ఎస్‌ఎస్ వ్యవస్థాపకుడు డాక్టర్ హెడ్గేవార్, గురూజీ చిత్రపటాలను పూలమాలలతో అలంకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ సంస్కృతి, సంప్రదాయాలకు మూలమైన వేదాలను అందించిన ఆదిగురువు వేదవ్యాస మహర్షి జయంతినే గురు పౌర్ణమి అని తెలిపారు. కార్యక్రమంలో పోరెడ్డి శ్రీరాంరెడ్డి, మెట్టు వేణుగోపాల్‌రెడ్డి, బాల వెంకటేశ్వర్లు, సంకలమద్ది సత్యనారాయణరెడ్డి, రాచకొండ శ్రీనివాస్, మాశెట్టి మోహన్, నరేందర్‌రెడ్డి, అశోక్, లక్ష్మయ్య, వాసు, మధుసూదన్‌రెడ్డి, రాము తదితరులు ఉన్నారు.

రోడ్డుపై రాళ్లు.. రాకపోకలకు ఇబ్బందులు



కొత్తతండా సమీపంలో రోడ్డుపై పోసిన రాళ్లు

పాలకవీడు : మండలంలోని జాన్‌పహాడ్ నుంచి మఠంపల్లి వెళ్లే ప్రధాన రహదారిపై జాన్‌పహాడ్ ఆవాస గ్రామం కొత్తతండా సమీపంలో రాళ్లు పోశారు. రెండు రోజులుగా తొలగించకపోవడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారిందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని భయాందోళన చెందుతున్నారు. నెల రోజుల క్రితమే కోట్ల రూపాయలతో నిర్మించిన ఈ రహదారి కొందరి నిర్లక్ష్యం కారణంగా ధ్వంసమవుతోందన్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి రాళ్లను తొలగించాలని కోరుతున్నారు.

విద్యుత్ స్తంభాలు తొలగించకుండానే..

తారు రోడ్డు నిర్మాణం

- ఆర్‌అండ్‌బీ, విద్యుత్‌శాఖల సమన్వయ లోపమే కారణం!



కొక్కిరేణి రహదారిపై విద్యుత్ స్తంభాలు

మునగాల : మండలంలోని కొక్కిరేణి రహదారిలో ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించకుండానే రోడ్డు కాంట్రాక్టర్ తారు రోడ్డు వేస్తుండటం ఆశ్చర్యంగా ఉంది. అయితే కొక్కిరేణి రహదారికి రూ.20 కోట్లు మంజూరు కాగా ఇటీవల రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. గత నెల రోజులుగా కొనసాగుతున్న నిర్మాణ పనులలో భాగాంగ కాంట్రాక్టర్ రహదారిపై ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించకుండానే తారు రోడ్డు వేస్తుండటంతో స్తంభాలు రోడ్డు మధ్యలోనే ఉంటున్నాయి. తిమ్మారెడ్డిగూడెం- గణపవరం రహదారి మధ్యలో ఈవిధంగా మొత్తం పది విద్యుత్ స్తంభాలు ఉన్నాయి. అయితే ఆర్‌అండ్‌బీ, విద్యుత్ శాఖల మధ్య సమన్వయ లోపంతోనే ఈవిధంగా జరిగిందని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. అయితే స్తంభాలు తొలగించాలని ఆర్‌అండ్‌బీ అధికారులు తమకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని విద్యుత్ శాఖ సిబ్బంది చెప్పడం హాస్యాస్పదంగా ఉంది. ఇప్పటికైనా రెండు శాఖల ఉన్నతాధికారులు ఈ విషయమై పూర్తిస్థాయిలో పరిశీలించి విద్యుత్ స్తంభాలను తొలగించి రహదారి నిర్మాణ పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదకరంగా గుంత



చిలుకూరు గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ప్రమాదకరంగా గుంత

చిలుకూరు : మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఎదుట గుంత ప్రమాదకరంగా ఉంది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. అక్కడే పశువైద్యశాల ఉండటంతో పశువుల వైద్యం నిమిత్తం వచ్చే రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు నిత్యం గ్రామపంచాయతీకి వచ్చి వెళ్తున్నా వారు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. అక్కడ నూతన కల్వర్టు నిర్మించే సమయంలో ఆ గుంతపై స్లాబ్ వేస్తే సమస్య పరిష్కారం అవుతుందని గ్రామస్తులు అంటున్నారు.

టీడీపీ ఇన్‌చార్జ్‌పై నాయకుల అసంతృప్తి



సమావేశంలో మాట్లాడుతున్న నరేందర్

హుజూర్‌నగర్ : తెలుగుదేశం పార్టీ హుజూర్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌పై నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు అసంతృప్తిగా ఉన్నారని పార్టీ నల్లగొండ పార్లమెంటు నియోజకవర్గ అధికార ప్రతినిధి సోమగాని నరేందర్‌గౌడ్ తెలిపారు. ఆదివారం హుజూర్‌నగర్‌లోని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవన్‌లో జరిగిన టీడీపీ నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ను మార్చాలని సమావేశంలో అందరూ కోరారన్నారు. పార్టీ అధిష్టానాన్ని కలిసి ఇన్‌చార్జ్‌గా సరైన వ్యక్తిని నియమించాలని కోరతామని ఆయన తెలిపారు. సమావేశంలో టీడీపీ పార్లమెంటు నియోజకవర్గ బీసీ సెల్ మాజీ అధ్యక్షుడు బి.రామజోగి, బీసీ సెల్ రాష్ట్ర మాజీ కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు, నాయకులు పాల్వాయి రమేష్, ఎస్‌కే.అలీ, ఐ.వెంకటయ్య, గోవింద్, ఎన్.అంజయ్య, ఆర్.లింగయ్య, పి.సురేష్, పి.లింగారెడ్డి, పి.వెంకన్న, తిరుమలి, బ్రహ్మయ్య, నాగరాజు, సీతారాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం

- ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్



గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్

కోదాడ రూరల్ : తెలంగాణలో పేద ప్రజలకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం అండగా నిలుస్తోందని కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. మండలంలోని గుడిబండ గ్రామంలో వివిధ కులాలకు చెందిన వంద కుటుంబాలు ఆదివారం ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. వారికి ఆయన గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధికి ఆకర్షితులై ప్రజలు బీఆర్‌ఎస్ పార్టీలో చేరుతున్నారన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాలు, పట్టణాల రూపురేఖలు మారాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చింత కవిత, బీఆర్‌ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు సలీం, పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు గీత, నాయకులు శేషు, ఖాజా సురేష్, గాంధీ, బుచ్చయ్య, భిక్షం, అంబేద్కర్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయంలో ఎమ్మెల్యే పూజలు..

గురుపౌర్ణమి సందర్భంగా మండలంలోని నల్లబండగూడెంలో గల సాయిబాబా దేవాలయంలో ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంపీపీ చింత కవిత, జెడ్పీటీసీ మందలపు కృష్ణకుమారి, ఎంపీటీసీ క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పొనుగోడులో గంగమ్మకు బోనాలు



బోనాలతో ఆలయానికి ప్రదర్శనగా వెళ్తున్న మహిళలు

గరిడేపల్లి : గరిడేపల్లి మండలంలోని పొనుగోడు గ్రామంలో ఆదివారం గంగమ్మ జాతరను యాదవులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలతో ప్రదర్శనగా గంగమ్మ దేవాల యానికి వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో యాదవ కులస్తులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

శక్తికేంద్రాలను బలోపేతం చేయాలి



కోదాడఅర్బన్ : మాట్లాడుతున్న నవనీత్‌రెడ్డి

కోదాడఅర్బన్ : బీజేపీ శక్తి కేంద్రాల బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని పార్టీ పట్టణ విస్తారక్ నవనీత్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి అక్కిరాజు యశ్వంత్‌లు పేర్కొన్నారు. ఆదివారం కోదాడలోని బీజేపీ కార్యాలయంలో పట్టణ ఇన్‌చార్జ్ సాతులూరి హనుమంతరావు ఆధ్వర్యంలో జరిగిన శక్తి కేంద్ర ఇన్‌చార్జ్‌లు, బూత్ కమిటీల అధ్యక్షుల సమావేశంలో వారు మాట్లాడారు. పట్టణంలో శక్తికేంద్రాలు, బూత్ కమిటీల సభ్యులు చురుగ్గా పనిచేయాలన్నారు. ఇంటింటికి తిరిగి మోదీ చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో గెలవాలంటే బూత్ కమిటీలను పటిష్టం చేయాలన్నారు. సమావేశంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి బొలిశెట్టి కృష్ణయ్య, రాష్ట్ర నాయకురాలు నూకల పద్మారెడ్డి, కనగాల నారాయణ, యాదా రమేష్, పురుషోత్తం, రవికుమార్, లక్ష్మణ్, పిచ్చయ్య, భాగ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

నడిగూడెం : కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ మండల ఇన్‌చార్జ్, అల్పకాలిక విస్తారక్ ప్రవీణ్‌కుమార్ కోరారు. ఆదివారం మండల పరిధిలోని శ్రీరంగాపురంలో కేంద్ర ప్రభుత్వ పథకాలపై నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మండలంలో బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు షేక్.లతీఫ్, బండారు రవి, కొల్లు శ్రీను, ఆకుల లక్ష్మి, రెడ్డిపల్లి నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలి



కరపత్రం ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

నేరేడుచర్ల : కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 7వ తేదీన నిర్వహించ తలపెట్టిన కలెక్టరేట్ వద్ద ధర్నాను కార్మికులు విజయవంతం చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ రామ్మూర్తి, భవన నిర్మాణ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు యారవ శ్రీనివాస్‌లు కోరారు. ఆదివారం మండల కేంద్రంలో ధర్నా కరపత్రం ఆవిష్కరించి మాట్లాడారు. వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలం అయ్యాయని ఆరోపించారు. కార్మిక వెల్ఫేర్ బోర్డుకు కేటాయించిన రూ.1800 కోట్లను కార్మికుల సంక్షేమం కోసం ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన వారందరికీ రేషన్‌కార్డులు, డబుల్ బెడ్ రూం ఇళ్లు, ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో వివిధ రంగాల కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

మ్యారేజ్ బ్యూరో అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులు

కోదాడఅర్బన్ : తెలంగాణ రాష్ట్ర మ్యారేజ్ బ్యూరో వెల్ఫేర్ అసోసియేషన్ కోదాడ నూతన కార్యవర్గాన్ని ఆదివారం కోదాడలోని షాదీఖానలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆ సంఘం రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షురాలు కల్పనారెడ్డి హాజరయ్యారు. కాగా కోదాడ నియోజకవర్గ అధ్యక్షుడిగా ఈర్ల వాసుదేవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ నిజాముద్దీన్, ప్రధాన కార్యదర్శులుగా వీరబాబు, బ్రహ్మారెడ్డిలు, ఉపాధ్యక్షురాలిగా లతీఫ్‌బీ, తదితరులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు యాదగిరి, ఉపాధ్యక్షుడు యాకుబ్‌అలీ, కృష్ణారెడ్డి, రుక్మారావు, లక్ష్మణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జనగర్జన సభకు తరలిన కాంగ్రెస్ నాయకులు



హుజూర్‌నగర్ నుంచి ఖమ్మం సభకు తరలివెళ్తున్న కాంగ్రెస్ నాయకులు

హుజూర్‌నగర్ : తెలంగాణలో రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్న అన్నారు. ఖమ్మంలో ఆదివారం నిర్వహించిన కాంగ్రెస్ జన గర్జన బహిరంగ సభకు హుజూర్‌నగర్ నుంచి నాయకులు వాహనాల్లో తరలివెళ్లారు. వాహనాలను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

మఠంపల్లి : ఖమ్మంలో ఆదివారం జరిగిన కాంగ్రెస్ పార్టీ జనగర్జన బహిరంగ సభకు కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు మండలం నుంచి భారీ సంఖ్యలో తరలివెళ్లారు. మండల అధ్యక్షుడు భూక్యా మంజీనాయక్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వంటిపులి శ్రీనివాస్, నాయకులు బచ్చలకూరి బాబు, సయ్యద్‌నిజాం, కె.నాగరాజు, ఆర్.అప్పారావు, మహాలక్ష్మి, స్రవంతీకిషోర్‌రెడ్డి, సక్రునాయక్, నాగునాయక్, ఎల్లారెడ్డి, పిచ్చిరెడ్డి, గురవయ్య, ఖరీం, రామచంద్రయ్య తదితరులు ఉన్నారు.

నడిగూడెం : ఖమ్మం పట్టణంలో ఆదివారం జరిగిన కాంగ్రెస్ జన గర్జన బహిరంగ సభకు నడిగూడెం మండలం నుంచి కాంగ్రెస్ నాయకులు తరలివెళ్లారు. మండల కార్యదర్శి వేపూరి సుధీర్, గుండు లింగరాజు, మన్నెం ప్రతాపరెడ్డి, రియాజ్, రశీద్, శ్రీరామ్, విజయ్, సాయి, తదితరులు ఉన్నారు.

హుజూర్‌నగర్‌రూరల్ : ఖమ్మంలో ఆదివారం నిర్వహించిన కాంగ్రెస్ జనగర్జన సభకు మండలంలోని గోపాలపురం గ్రామ సర్పంచ్ శాసనాల నాగసైదయ్య ఆధ్వర్యంలో నాయులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ఐఎన్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు బెల్లంకొండ గురవయ్యగౌడ్, గ్రామశాఖ అధ్యక్షుడు బ్రహ్మం, వెంకటేశ్వరరావు, తదితరులు ఉన్నారు.